ప్రజాశక్తి
శుక్రవారం 13 అక్టోబర్ 2023
5
అనంతపురం

జగన్న కాలనీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్ తదితరులు

ఈకేవైసీకి దూరంగా 20 వేల మంది..!

◆ సాంకేతిక సమస్యలు, చేతివాటం
◆ నేటితో ముగియనున్న గడువు ◆ ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఈ-కెవైసికి ఇంకా 20 వేల మంది రైతులు దూరంగా ఉన్నాయి. ఈ-క్రాప్ బుకింగ్ కూడా ఇంకా జరగాల్సి ఉంది. ఈ-కెవైసి మాత్రం 93 శాతమే పూర్తయింది. శుక్రవారంతో నమోదు గడువు కూడా ముగియనుంది. మిగిలిపోయిన వారికి ప్రభుత్వ సహాయం ప్రశ్నార్థకమే అయ్యే సూచనలున్నట్టు సమాచారం. ఈ-క్రాప్, ఈ-కెవైసి రెండూ ఉంటేనే రైతులకు పంటలబీమా అయినా, నష్ట పరిహారమైనా, రైతు భరోసా అయినా వస్తుంది. అవి లేకపోతే రైతులకు ప్రభుత్వ సహాయం అందటం ప్రశ్నార్థకం. ప్రభుత్వం ఈ మేరకు మార్గదర్శకాలు సైతం ఇచ్చింది. ఈ మేరకు ఈ ప్రక్రియ గత కొంతకాలంగా నడుస్తూ వచ్చింది. ఒక్క రోజుల్లో ఏడు శాతం పూర్తి చేయడం సాధ్యమవుతుందా అన్నది చూడాల్సి ఉంది.

అనంతపురం జిల్లాలో 3.86 లక్షల హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. ఈ-క్రాప్ బుకింగ్ 3.59 లక్షల ఎకరాలు మాత్రమే జరిగింది. ఇప్పటికి 93 శాతం పూర్తయింది. రైతులకు సంబంధించి ఈ-కెవైసి ఇంకా పూర్తి స్థాయిలో జరగలేదు. మొత్తం రైతులు 2,63,198 మంది రైతులుంటే.. 2,42,906 మంది రైతులు ఈ-కెవైసి చేసుకున్నారు. 20 వేల మంది రైతులు ఇంకా ఈ-కెవైసి చేసుకోవాల్సి ఉంది. రెండు కలిపి 93 శాతం

పూర్తయింది. శింగనమల, విడపకల్లు మండలాల్లో 89 శాతమే పూర్తయ్యింది. కళ్యాణదుర్గం మండలంలో 90 శాతం మాత్రమే పూర్తయ్యింది. బుక్కరాయసముద్రం, బ్రహ్మసముద్రం, గుత్తి మండలాల్లో 91 శాతమే పూర్తయ్యాయి. అనంతపురం మండలంలో 99.7 శాతం అత్యధికంగా నమోదయిన మండలంగా ఉంది.

అమల్లో సాంకేతిక సమస్య, చేతివాటాలు

అమల్లోకి సాంకేతిక సమస్యలున్నాయి. కొన్ని ఉత్పన్నమవుతుండగా, కొన్ని చోట్ల చేతివాటం నడుస్తున్నట్టు ఆరోపణలున్నాయి. బీమా, నష్ట పరిహారం, రైతుభరోసా అన్ని రకాల సహాయం అందటానికి ఇదే కీలకం కావడంతో ఇవి పూర్తి చేయాలంటే తమకు కొంత ముట్టజెప్పాలన్న డిమాండ్ కూడా వినిపిస్తోంది. రూ.500 నుంచి వెయ్యి రూపాయలకు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇక కొన్ని చోట్ల మాత్రం సాంకేతిక సమస్యలూ ఉత్పన్నమవుతున్నాయి. ప్రధానంగా వరి పంట నమోదులో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పంట మధ్యలోకెళ్లి ఈ-క్రాప్ బుకింగ్ చేయాల్సి ఉంటుంది. వెళ్లకుండా గట్టుపై నుంచి బుకింగ్ చేస్తే సక్రమంగా నమోదవనట్టు తెలుస్తోంది.

తదుపరి ప్రక్రియ :

నేటితో ఈ-క్రాప్, ఈ-కెవైసి నమోదు ప్రక్రియ పూర్తవుతుంది. ఈనెల 15 నుంచి 19వ తేదీన వరకు సోషియల్ ఆడిట్, గ్రామ సభలు నిర్వహిస్తారు. ఈనెల 23వ తేదీన సోషియల్ ఆడిట్ ఫిర్యాదులు పరిష్కరించబడును. ముసాయిదా జాబితాను ఈనెల 25వ తేదీన రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రదర్శించనున్నారు.

పేదలందరికీ గృహాలు

దేశంలో ఎక్కడా లేని విధంగా ఇళ్ల నిర్మాణాలు
సామూహిక గృహప్రవేశాల్లో నాయకులు

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

సొంతింటి కలను సాకారం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికీ ఇళ్ల పట్టాలను మంజూరు చేసి గృహాలను నిర్మించి ఇస్తున్నట్లు ఎంపీ తలారి రంగయ్య తెలిపారు. తాడిపత్రి మండలం సజ్జలదిన్నె గ్రామం వద్దనున్న వైఎస్సార్ జగనన్న సజ్జలదిన్నె కాలనీ-1లో గహప్రవేశ మహోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, కలెక్టర్ ఎం.గౌతమి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ తలారి రంగయ్య మాట్లాడుతూ జిల్లాలో 23,385 ఇళ్లను పూర్తి చేసి గురువారం నాడు గహప్రవేశ మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. జిల్లాలో 26 వేల ఎకరాలను ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వం ఇచ్చిందన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్ల అనంతరం ఏమి లబ్ధి కలిగింది అనేది ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలని సూచించారు. గత పాలనకు ఇప్పటి పాలనకు తేడా చూసుకుని వచ్చే ఎన్నికల్లో సరైన నిర్ణయం తీసుకోవాలని ప్రజలను కోరారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మాట్లాడుతూ తాడిపత్రిలో 4,500 పట్టాలను మంజూరు చేశామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను వారి ఇంటి వద్దకే వెళ్లి అందజేస్తున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇలాంటి పరిస్థితి ఉండేది కాదన్నారు. కలెక్టర్ గౌతమి మాట్లాడుతూ జగనన్న కాలనీలలో యుద్ధ ప్రాతిపదికన మౌలిక వసతుల కల్పన చేపడతామన్నారు. అన్ని సదుపాయాలు కల్పించిన తర్వాత ఇల్లు కట్టుకుని పూర్తి చేసుకోవడం లబ్ధిదారుల బాధ్యత అన్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తి చేసేందుకు అవసరమైన సహకారం అందించేందుకు అధికారులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని సూచించారు. అనుకూల పరిస్థితులు ఉన్నప్పుడు లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని, ఇళ్లు కట్టుకునేందుకు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రజక కార్పొరేషన్ ఛైర్మన్ మీసాల రంగన్న, ఎడిసిసి బ్యాంక్ ఛైర్పర్సన్ లిఖిత, సిడబ్ల్యూసి ఛైర్పర్సన్ మేడా రామలక్ష్మి, హౌసింగ్ పీడీ నరసింహారెడ్డి, ఆర్డీవో మధుసూదన్, పిఆర్ ఎస్ఈ భాగ్యరాజ్, హౌసింగ్ డిఈ కష్టారావు, మాజీ ఎడిసిసి బ్యాంక్ ఛైర్పర్సన్ పామిడి వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడుగుంతల పేరుతో దోపిడీ

జగన్నకాలనీల్లో నిధులు దుర్వినియోగం
ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేయాలి
సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా చేస్తున్న జగన్న కాలనీల్లో ఇంకుడు గుంతల పేరుతో పెద్ద ఎత్తున దోపిడీ జరిగి, ప్రజాధనం లూటీ అవుతోందని సిపిఎం నాయకులు విమర్శించారు. గురువారం నాడు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప, మండల కార్యదర్శి ఆర్.కుళ్లాయప్పలు మాట్లాడారు. 2018-19లో ఉపాధి హామీ పథకం కింద ఇంకుడు గుంతల నిర్మాణ పనులను వ్యక్తిగతంగా ఇళ్ల దగ్గర ఖాళీజాగాలో ఏర్పాటు చేసుకుని వర్షం నీరు, ఇంట్లోని స్నానం, బట్టల, నీళ్ల భూగర్భంలో ఇంకెందుకు ఉద్దేశించి అమలు చేశారన్నారు. ఉపాధి పనుల్లో ఎక్కడా కాంట్రాక్టర్లు చేయాలనే నిబంధన లేదని చెప్పారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణలో లబ్ధిదారుల ద్వారా ఈ పనులు చేయించాల్సి ఉందన్నారు. ఇందుకు విరుద్ధంగా జగన్న కాలనీల్లో ఇంకుడు గుంతల పనులు జరుగుతున్నాయని చెప్పారు. జగనన్న కాలనీల్లో కేంద్రం నుంచి రూ.1.50 లక్షలు నిధులతో ఇల్లు నిర్మిస్తూ, కేంద్రం ఇచ్చే ఉపాధి నిధులను లబ్ధిదారులకు ఇవాల్సిన 30 వేల రూపాయల్లో మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.23 వేలు పోగా మిగిలిన 7 వేల రూపాయల్లో ఇంకుడు గుంత కోసం ఇవ్వాలని ఉందన్నారు. ఇక్కడే అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై లబ్ధిదారుల ప్రమేయం లేకుండానే నడి రోడ్డు మీద వాటిని ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. దీనివల్ల ప్రజాధనం వృథా అవుతోందన్నారు. లబ్ధిదారులు ఇప్పటికే ఏర్పాటు చేసుకున్న వారికి ఈ నిధులను నేరుగా అర్హతను బట్టి ఇవ్వవచ్చు. ఇలా కాకుండా కేవలం కాంట్రాక్టర్ల జేబులు నింపడానికి ఈ నిధులను పక్కదోవ పట్టిస్తున్నారు. ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న ఇంకుడు గుంతలు ఏ ఒక్కటీ ఉపయోగపడే పరిస్థితి లేదన్నారు. మరుగుకాలువలు, సిమెంట్ రోడ్లు వస్తే ఇంకుడు గుంతలు తొలగించాల్సిందే అన్నారు. ఇంకుడు గుంతల కోసం ఇస్తున్న వస్తువులు కూడా నాణ్యగా ఉండడం లేదన్నారు. ఇందులో కూడా పెద్దఎత్తున అవినీతి చోటు చేసుకుంటోందని చెప్పారు. దీనిపై సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలన్నారు. జగనన్న కాలనీల్లో ఏర్పాటు చేస్తున్న ఇంకుడు గుంతల కార్యక్రమాన్ని జిల్లా ఉన్నత స్థాయి ఇంజనీర్లతో కమిటీ వేసి విచారణ జరపాలన్నారు. నిధులు వథా కాకుండా కాలనీల్లో డ్రెయినేజీ కాలువలు వేయడానికి ప్రాధాన్యత ఇచ్చి, కాలనీల్లో మౌలిక సదుపాయాలపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు సి.నాగేంద్ర. బి.హరికష్ణ, నెట్టికంటయ్య, సంజీవరెడ్డి, పుల్లయ్య పాల్గొన్నారు.

రైతులకు 9 గంటల విద్యుత్‌ను సరఫరా చేయాలి

వ్యకాసం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్

ప్రజాశక్తి-శింగనమల

రైతులకు 9 గంటల నిరంతర, నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని తరిమెల గ్రామంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు రైతుసంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనవ మాట్లాడుతూ మండలంలో వారం రోజుల నుంచి రోజుకు 4 నుంచి 5 గంటలు మాత్రమే రైతులకు కరెంటు సరఫరా చేస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ సర్‌ఛార్జీల పేరుతో రైతు, పేదల నడ్డి విరుస్తున్నాయన్నారు. ముఖ్యంగా రానున్న స్మార్ట్ మీటర్లతో సామాన్యులకు మరో ముప్పు పొంచి ఉందన్నారు. కార్పొరేట్ జేబులను నింపేందుకు 40 పైసలు కలిపి యూనిట్‌కు 20 పైసలు చొప్పున జనం నెత్తిన బండ వేస్తున్నారన్నారు. రాజకీయ అవినీతిపరులు, కార్పొరేట్లు కుమ్మక్కై రూ.2 నుంచి రూ.3కు కొనాల్సిన విద్యుత్‌ను బహిరంగ మార్కెట్‌లో రూ.10 నుంచి రూ.20కి కింటున్నారన్నారు. ఇటీవల నిబంధనలకు విరుద్ధంగా హిందుజా సంస్థకు రూ.1,200 కోట్ల అప్పనంగా చెల్లించడమే ఇందుకు నిదర్శమన్నారు. స్మార్ట్ మీటర్లు వస్తే చిన్న బల్బులు రీడింగ్‌లోకి వస్తాయన్నారు. తద్వారా డబ్బు చెల్లించి సెల్‌ఫోన్ మాదిరిగా ఫ్రీ ఫెయిర్ పద్ధతి కూడా వస్తుందని హెచ్చరించారు. అంతేగాకుండా రాత్రిపూట ఎక్కువ రేటు ఉండే ప్రమాదం పొంచి ఉందన్నారు. కావున ప్రతి ఒక్కరూ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణరెడ్డి, సుంకన్న, ఖాదర్‌వలి, లక్ష్మీనారాయణ, సాయినాథ్‌రెడ్డి, ఆంజనేయులు, రామాంజనేయులు, రమేష్, శ్రీనివాసులు, మేకల పెద్దన్న, ఆంజనేయులు, లక్ష్మీనారాయణ, నాగరాజు, చెంగల్ ధనుంజయ, వెంకట్‌నారాయణ, రాముడు, కుళ్లాయిస్వామి, గంపన్న, పెద్ద ఆంజనేయులు, అప్పా రాజు, దొడ్ల అయ్యప్ప, రామదాసు, రాముడు, తదితరులు పాల్గొన్నారు.

తరిమెల సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న వ్యకాసం, రైతుసంఘం నాయకులు

చంద్రబాబు అక్రమ కస్టడీని ఖండిద్దాం..

మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

చంద్రబాబు అక్రమ కస్టడీని ప్రజలంతా ఖండించాలని అనంతపురం మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని 1వ డివిజన్ ఎర్రనేల కొట్టాలలో బాబు అక్రమ అరెస్టు అంశాన్ని ఇంటింటికీ వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు వయసును కూడా చూడకుండా , రుజువులు సాక్షాలు లేకపోయినా అక్రమంగా నిర్బంధించారని, ప్రజలు అన్ని గమనిస్తున్నారని బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. జెఎన్‌టియుతోపాటు నగరంలోని రెండు స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాలను పరిశీలించానని, అక్కడ వేల మంది విద్యార్థులకు శిక్షణ అందించారని, ప్రభుత్వ రాష్ట్రంలోని 42 కేంద్రాలను ప్రాథమికంగా పరిశీలిస్తే నిజానిజాలు తెలుస్తాయన్నారు. అన్నా క్యాంటీన్లలో, పెన్షన్లలో, డ్రిప్ సబ్సిడీల్లో కూడా అవినీతి ఉందేమో అంటారని వ్యంగంగా విమర్శించారు. ప్రభుత్వానికి రోజుల దగ్గర పడ్డాయని, ప్రజలు అసహ్యించుకుంటున్నారని, ఎందుకు ఓటేశామని బాధపడుతున్నారన్నారు. తమకు పైస్థాయిలో న్యాయం జరగనప్పుడు, ప్రజలలోకి వెళు తున్నామన్నారు. ప్రజల నుంచి స్పందన లభిస్తోందని, చంద్రబాబు అక్రమ అరెస్టు గురించి బాధపడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తలారి ఆదినారాయణ,దేవల్ల మురళి,ముక్తియార్, అజీజ్, సరిపూటి రమణ, చంద్రమౌళి, ఖాదర్ వలి, బంగి నాగ, మారుతీకుమార్‌గౌడ్, వెంకటేష్, రాజారావు, నారాయణస్వామి యాదవ్, సుధాకర్ యాదవ్, బొమ్మినేని శివ, కడియాల కొండన్న, మల్లికార్జున, ,గుర్రం నాగభూషణ, ముబారక్, రఫిక్ అహ్మద్, గోపాల్ గౌడ్, బోయపాటి బాలప్ప, రాయల్ రఘు, జేయం భాష, పోతుల లక్ష్మీనరసింహులు, వన్నూర్, బోయ మూర్తి, కనుమచౌడయ్య, గంగవరం అంజి, తెలుగు మహిళలు విజయ్ శ్రీరెడ్డి, తేజస్విని, సరళ, జానకి, వెంకటలక్ష్మి, వరలక్ష్మి, బుజ్జమ్మ, హసీనా, షరీనా, కృష్ణవేణి, వసుంధర, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో పర్యటిస్తున్న మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి

అన్నివర్గాలకూ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

ప్రజాశక్తి-పుట్లూరు

పార్టీలు, కులమతాలకు అతీతంగా అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. గురువారం యల్లనూరు మండలం దంతలపల్లి, కొత్తపల్లి, నేర్జాంపల్లి, లక్ష్మంపల్లి గ్రామాల్లో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో అధికారంలోకి వచ్చిన తర్వాత 99 శాతానికిపైగా అమలు చేశారన్నారు. అనంతరం మండల పరిధిలోని దంతలపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని పరిశీలించారు. జగనన్న ఆరోగ్య సురక్షతో ఆరోగ్య భద్రత లభిస్తుందని, ప్రజల ఆరోగ్యం తమ బాధ్యతగా భావించిన ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, ప్రజా ప్రతినిధులు, మండల నాయకులు, మండల అధికారులు, వైద్యాధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలి

పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కెఎస్ఎస్ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-అనంతపురం

ప్రతి ఒక్కరూ హృదయాన్ని వీలైనంత మంచి ఆలోచనలతో ఉంచుకుని మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కెఎస్ఎస్ వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. మానసిక వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ మెడికల్ కళాశాల మానసిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ వైద్యనాథ్ ఆధ్వర్యంలో గురువారం ఆసుపత్రిలోని సెంట్రల్ హాలులో మానసిక ఆరోగ్యంపై అవగాహన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజమైన అందం ముఖాల్లో కాదని, హృదయాల్లో ఉందన్నారు. ప్రతి ఒక్కరూ చిరునవ్వుతో దినచర్య ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మాణిక్యరావు వైస్ ప్రిన్సిపాళ్లు ఆరేపల్లి శ్రీదేవి, షారోన్ సోనియా, మానసిక శాస్త్ర విభాగాధిపతి వైద్యనాథ్, బయో కెమిస్ట్రీ విభాగాధిపతి దుర్గ, ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగాధిపతి శంకర్, అనాటమీ విభాగాధిపతి ఉమా మహేశ్వరరావు, డిప్యూటీ ఆర్ఎంఒ హేమలత, సైకియాట్రి డాక్టర్లు శారద, అనిల్‌కుమార్, పి.రవికుమార్, వరదరాజులు, సశాంక్, సాయిపవన్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల అధ్యాపకులు లక్ష్మీదేవి, మంజులాదేవి, రమాబాయి, మెడికోలు, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కెఎస్ఎస్ వెంకటేశ్వరరావు

హమాలీల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

హమాలీల సమస్యలు పరిష్కరించాలని సివిల్ సప్లయి హమాలీ జిల్లా యూనియన్ గౌరవాధ్యక్షుడు ఆర్.వి నాయుడు డిమాండ్ చేశారు. ఈమేరకు సివిల్ సప్లయి హమాలీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సివిల్ సప్లయి హమాలీ జిల్లా యూనియన్ ఆధ్వర్యంలో సివిల్ సప్లయి కార్పొరేషన్ ఇన్‌ఛార్జి జిల్లా మేనేజర్ వెంకట్రామిరెడ్డికు గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 12 స్టాక్ పాయింట్లలో పనిచేస్తున్న హమాలీలకు గతంలో 10 తేదీ నుంచి 15వ తేదీ లోపు జీతాలు చెల్లించేవారన్నారు. ఇప్పుడు 20వ తేదీ వస్తున్నప్పటికీ జీతాలు ఇవ్వడం లేదన్నారు. దీంతో హమాలీల కుటుంబాలు ఆర్థికంగా చాలా ఇబ్బంది పడుతున్నారు. కావున వెంటనే చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 7, 8 సంవత్సరాలుగా పనిచేస్తున్నప్పటికీ వీరికి ఎక్కడా పిఎఫ్ ఇవ్వలేదన్నారు. వెంటనే పిఎఫ్ నెంబరు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఇఎస్ఐ కార్డులు అమలు చేయాలని, అనంతపురం రూరల్ స్టాక్ పాయింట్‌ను ఆత్మకూరు నుంచి అనంతపురం అర్బన్‌లో పెట్టాలని కోరారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నారాయణస్వామి, సుభాన్, శంకర్, తదితరులు ఉన్నారు.

తాగునీటి కోసం
రోడ్డెక్కిన మహిళలు

ప్రజాశక్తి-గుత్తి

తాగునీరు సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ గుత్తి ఆర్ఎస్ లో మహిళలు గురువారం రాస్తారోకో నిర్వహించారు. 6, 7వ వార్డులకు చెందిన మహిళలు ఖాళీ బిందెలతో పత్తికొండ రోడ్డు కూడలికి చేరుకుని వాహనాల రాకపోకలను అడ్డుకుని ఆందోళన చేపట్టారు. అనంతరం మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ నెలల తరబడి తాగునీటిని సరఫరా చేయకపోతే బతకాలని ప్రశ్నించారు. దాదాపు రెండు నెలలుగా తమవార్డులకు నీరు సరఫరా కావడం లేదన్నారు. ఈ విషయమై ఎన్నిసార్లు మున్సిపల్ అధికారులకు చెప్పిన పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి కోసం తాము అనేక అవస్థలు పడుతున్నామని పట్టించుకునే నాథుడే కరువయ్యాడని వాపోయారు. కొళాయిల ద్వారా తాగునీటిని సక్రమంగా సరఫరా చేయని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఖాళీ బిందెలతో రాస్తారోకో చేస్తున్న మహిళలు

పేదల సొంతింటి కల సాకారం

మంత్రి ఉషశ్రీచరణ్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

రాష్ట్రంలో అర్హులందరికీ సొంతిల్లు ఉండాలన్న కోరికను సిఎం జగన్ నెరవేరుస్తున్నారని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని గూబనపల్లి గ్రామం వైఎస్ఆర్ జగనన్న కాలనీలో నూతనంగా నిర్మించిన గృహాలను గురువారం మంత్రి ప్రారంభించగా లబ్ధిదారులు గృహ ప్రవేశం చేశారు. మంత్రి మాట్లాడుతూ పేదల సొంతింటి కల నెరవేర్చడం అన్నది నిరంతర ప్రక్రియ అన్నారు. సొంతిల్లు లేని వారు సంబంధిత పత్రాలను ఆయా సచివాలయాల్లో అందజేస్తే పరిశీలించి అర్హులకు ఇల్లు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో హౌసింగ్, మున్సిపల్, విద్యుత్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాయదుర్గం : రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం, మంచి జరగాలంటే వచ్చే ఎన్నికల్లో మరోమారు వైసిపిని ఆశీర్వదించాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి కోరారు. 'అందరికీ ఇళ్లు' కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని గౌడ లేఔట్‌లో నూతనంగా నిర్మించిన గృహాలను గురువారం ఎమ్మెల్యే గృహ నిర్మాణ సంస్థ రాష్ట్ర డైరెక్టర్ ఐ.శ్రీనివాసు లు, మున్సి పల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్పతో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడ్కో ఇళ్లకు టిడిపి ప్రభుత్వం నెలకు రూ. 3వేల చొప్పున 20 ఏళ్ల పాటు డబ్బు చెల్లించాల్సి ఉంటుందని చెప్పగా సిఎం జగన్ ఒక్క రూపాయి నామమాత్ర రుసుముతో ఆ ఇళ్లను లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు తెలిపారు. కాలనీలో ప్రజలు చేరకముందే పట్టణ ఆరోగ్య కేంద్రాలను ప్రారంభించామన్నారు. అబద్ధాలు చెప్పే చంద్రబాబుకు ప్రజలు బుద్ధి చెప్పారని, ఎన్నికల తర్వాత ఆ పార్టీ శాశ్వతంగా సమాధి అవుతుందన్నారు. సభకు అధ్యక్షత వహించిన తహశీల్దార్ మారుతి మాట్లాడుతూ పట్టణంలో 1,484 ఇళ్లను నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్లు శ్రీనివాస్‌యాదవ్, వలిబాషా, కమిషనర్ దివాకర్‌రెడ్డి, ఎఇ జయచంద్ర, మున్సిపల్ మాజీ ఛైర్మన్ ఉపేంద్ర రెడ్డి, కౌన్సిలర్లు శ్రీనివాసులురెడ్డి, గోవిందరాజులు, ఫకృద్దీన్, శ్రీలక్ష్మి, ఉష, శారద, పద్మజ, దేవరాజ్, కో ఆప్షన్ సభ్యులు శ్రీనివాసులు, శర్మాస్, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని మెచ్చిరి గ్రామం జగనన్న లేఅవుట్‌లో సామూహిక గృహ ప్రవేశం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచి ఉల్లెమ్మ లబ్ధిదారురాలు పద్మావతి ఇంటిని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కొండయ్య, హౌసింగ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శి హేమంత్‌కుమార్, వైసిపి నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : ముఖ్యమంత్రి జగన్ పేదల సొంతింటి కలను సాకారం చేసారని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి తెలిపారు. నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా మండలంలోని లేఅవుట్-5లో పూర్తి చేసుకున్న ఇళ్లను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పేదింటి అక్కచెల్లెమ్మల సొంతింటి కలను నెరవేర్చిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. పేదలందరికీ ఇళ్లు పథకం కింద మహిళల పేరుపై ఏకంగా 30.75 లక్షల ఇళ్లను మంజూరు చేసి దేశంలోనే రికార్డు సృష్టించినట్లు వివరించారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తికావడంతో పేదల జీవితాల్లో వెలుగులు నిండాయన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రమాదేవి, ఎంపిడిఒ తేజోష్ణ, ఇఒఆర్‌డి దామోదమ్మ, హౌసింగ్ ఎఇ రాజశేఖర్‌రెడ్డి, ఎంపిపి దాసరి సునీత, జడ్పిటిసి భాస్కర్, సర్పంచి పార్వతి, జెసిఎస్ కన్వీనర్ బయపరెడ్డి, గువ్వల రాజశేఖర్‌రెడ్డి, కాలవ వెంకటలక్ష్మి, కాలవ నారాయణస్వామి, పూల నారాయణస్వామి, ముత్యాల సీనా, మడకశిర చంద్ర, ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : విడపనకల్ మండల పరిధిలోని కరకముక్కల గ్రామంలో సర్పంచి రామాంజనేయులురెడ్డి, ఎంపిటిసి మల్లికార్జున ఆధ్వర్యంలో గురువారం జగనన్న ఇళ్ల ప్రవేశాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా గ్రామంలో వంద ఇళ్లు మంజూరు కాగా దాదాపు 50 వరకూ వివిధ దశల్లో నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. నిర్మాణాలు పూర్తన ఐదిళ్లలో లబ్ధిదారులు గృహప్రవేశాలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ రమ్య, వైసిపి నాయకులు రాముడు రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, గోపాల్, రామన్న, వెంకటేసులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం గూబనపల్లిలో ఇంటిని ప్రారంభిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

రాయదుర్గంలో ఇంటిని ప్రారంభిస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

బుక్కరాయసముద్రంలో ఇంటి పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

విడపనకల్లు మండలం కరకముక్కలలో ఇంటిని ప్రారంభిస్తున్న నాయకులు

నేరాలు ఘోరాలు

వృద్ధుడి అనుమానాస్పద మృతి

మృతిచెందిన వృద్ధుడు

కళ్యాణదుర్గం : మండల పరిధిలోని మోరేపల్లి గ్రామంలో గొర్ల బొరెన్న వ్యవసాయ పొలంలో సుమారు 65 ఏళ్ల వృద్ధుడు మృతి చెందాడు. గురువారం అటుగా వెళ్తున్న ప్రజలు గమనించి స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

చోరీ నిందితులు అరెస్టు

నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి

నార్పల : డ్రిప్పు వైర్ల కట్టలు చోరీ చేసే నిందితులను నార్పల క్రాస్‌లో అరెస్టు చేసినట్లు ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో నిందితులకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నార్పలకు చెందిన నాగరాజు, బుక్కరాయసముద్రం మండలం చెన్నంపల్లి గ్రామానికి చెందిన బయన్న రైతుల పొలాల్లోని డ్రిప్ వైర్లను చోరీ చేసేవారు. ఈనేపథ్యంలో దొంగలించి ఆటోలో తీసుకెళ్తున్న 97 కట్టల డ్రిప్పు వైరును స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులో తీసుకున్నట్లు తెలిపారు. అలాగే ఒక మోటార్ సైకిల్, లగేజీ ఆటోను సీజ్ చేశామన్నారు. అనంతరం నిందితులను కోర్టుకు హాజరుపరచగా రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు. మండలంలో ఎవరైనా రైతు డ్రిప్పులు, కేబుల్ వైర్లు, మోటార్లను దొంగలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

డ్రిప్‌వైర్ చోరీకి విఫలయత్నం

డ్రిప్పులను కట్టలు కట్టిన దృశ్యం

పుట్లూరు : మండల కేంద్రానికి చెందిన సూర్యనారాయణరెడ్డి అరటి తోటలో డ్రిప్ వైర్ చోరీకి విఫలయత్నం జరిగింది. వివరాల్లోకి వెళ్తే... సూర్యనారాయణరెడ్డి అదే గ్రామానికి చెందిన రైతుకు చెందిన మూడెకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని అరటి పంట సాగు చేశాడు. ఇందులో భాగంగానే బుధవారం సాయంత్రం 6 గంటల వరకూ పొలంలో పనులు చేసుకుని ఇంటికి వెళ్లాడు. గురువారం ఉదయం కూలీని తీసుకుని తోటలోకి వెళ్లే సరికి అరటి పంటకు పరిచిన డ్రిప్ వైర్‌ను కట్టలు కట్టడంతో పాటు సంచుల్లోకి వేశారు. దీంతో వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

మాజీ సర్పంచి మృతి

రామకేశవరెడ్డి (పాతచిత్రం)

పుట్లూరు : పుట్లూరు మాజీ సర్పంచి, వైసిపి సీనియర్ నాయకులు భూమిరెడ్డి గారి రామకేశవరెడ్డి గురువారం మృతిచెందారు. అనారోగ్యం రిత్యా పది రోజుల క్రితం అనంతపురంలోని సవేరా ఆసుపత్రిలో చేరిన ఆయన పరిస్థితి విషమించి మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిఆపరు. దీంతో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు సంతాపం వ్యక్తం చేశారు.

అంతర్ జిల్లాల పోటీలకు విద్యార్థులు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

అంతర్ జిల్లాల పోటీలకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

బుక్కరాయసముద్రం విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వసుంధర, వ్యాయామ ఉపాధ్యాయులు గోపాల్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-19 నెట్‌బాల్ బాలికల విభాగంలో దీపిక, దీక్షిత, తరుణి, నాగనందిని, బాలుర విభాగంలో భరత్, సందీప్, సాయి చరణ్, బాస్కెట్‌బాల్ బాలికల విభాగంలో నాగ సాహిత్య, బాలుర విభాగంలో భరత్, సందీప్, సాయిచరణ్ ఎంపికైనట్లు తెలిపారు. అలాగే త్రో బాల్ బాలుర భాగంలో మనోహర్, సాఫ్ట్‌బాల్ బాలుర విభాగంలో హర్షవర్ధన్, బేస్‌బాల్ బాలుర విభాగంలో తేజవర్ధన్‌నాయక్ ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు, పీడీ అభినందనలు తెలిపారు. అలాగే విద్యార్థుల ఎంపికకు కృషి చేసిన పీడీలు గోపాల్‌రెడ్డి, లలితమ్మను ఉపాధ్యాయులు అభినందించారు.

'శ్రీచైతన్య'లో స్మార్ట్‌లివింగ్ ప్రోగ్రాం

ప్రజాశక్తి-అనంతపురం

బహుమతులు అందజేస్తున్న ఎజిఎం సుబ్బారెడ్డి

నగరంలోని ఆదిమూర్తినగర్‌లో ఉన్న శ్రీచైతన్య పాఠశాల 9వ బ్రాంచిలో స్మార్ట్‌లివింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎజిఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి మనం తినే సమతుల ఆహారం ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. జయంత్ సూపర్ స్పెషాలిటీ వైద్య నిపుణులు డాక్టర్ జయంత్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో చిన్నారులు చాకోలెట్లు, పిస్తాలు, బర్గర్లు వంటి జంక్‌పుడ్స్‌కు అలవాటు పడి తమ ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారన్నారు. ఇలాంటివి తీసుకోవడం వల్ల దంత సమస్యలు వస్తాయన్నారు. కావున సమతుల ఆహారం తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తీసుకోవాలని సూచించారు. రోజూ ఉదయం, సాయంత్రం పళ్లను బ్రష్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శాంతా, జిల్లా కో ఆర్డినేటర్ తిరుమలేసు, అకడమిక్ డీన్ గంగాధర్ ప్రైమరి ఇన్‌ఛార్జి చంద్రకళ, ప్రీప్రైమరీ ఇన్‌ఛార్జి బత్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

కంబదూరు మండల పరిధిలోని అండేపల్లి గ్రామానికి చెందిన హోంగార్డు మారెన్న ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. దీంతో కళ్యాణదుర్గం, రాయదుర్గం పోలీస్ సర్కిల్ పరిధిలోని హోంగార్డులందరూ కలిసి రూ. 85 వేలు సమకూర్చి కళ్యాణదుర్గం సిఐ తేజోమూర్తి ద్వారా గురువారం ఆయన కుటుంబానికి అందజే శారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగమధు, హోంగార్డులు మారెన్న, జయకుమార్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎక్సలెన్స్ అవార్డును అందుకుంటున్న డాక్టర్ అభిషేక్‌రెడ్డి

డాక్టర్ అభిషేక్‌రెడ్డికి గ్లోబల్ హెల్త్‌కేర్ ఎక్సలెన్స్ అవార్డు

ప్రజాశక్తి-అనంతపురం

ప్రముఖ ట్రామా, జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ అభిషేక్‌రెడ్డికి గ్లోబల్ హెల్త్‌కేర్ ఎక్సలెన్స్ అవార్డు లభించింది. మెడికల్ డైరెక్టర్ ఆఫ్ కేర్, క్యూర్ ఆసుపత్రి క్వాలిటీ హెల్త్‌కేర్‌లో సాధించిన విజయాలకు ఈ అవార్డు లభించింది. దీంతో గురువారం ఢిల్లీలో మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్‌తో అవార్డును అందుకున్నారు.

విద్యుత్ కోతలతో రైతాంగాన్ని నట్టేట ముంచిన ప్రభుత్వం

శింగనమల : రాష్ట్ర ప్రభుత్వం విచ్చలవిడిగా విద్యుత్ కోతలను విధిస్తూ రైతులను నట్టేట ముంచుతోందని టిడిపి అధికార ప్రతినిధి డేగల కృష్ణమూర్తి గురువారం ఒక ప్రకటనలో అన్నారు. రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకుంటున్న జగన్ ప్రభుత్వం రైతాంగాన్ని నిట్టనిలువునా మోసం చేస్తోందన్నారు. ముఖ్యంగా రోజుకు కేవలం 2 నుంచి 4 గంటలు మాత్రమే కరెంట్ ఇస్తోందన్నారు. ఇక ఇళ్లకు ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి అన్నారు. విద్యుత్ కోతల కారణంగా ఇళ్లలో ఫ్యాన్లు లేకపోవడంతో దోమల కారణంగా ప్రజలు రోగాల భారిన పడుతున్నారన్నారు. మరోవైపు కరెంటు బిల్లులు మాత్రం భారీగానే వస్తున్నాయన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

చోళసముద్రానికి విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు

ఉరవకొండ : కూడేరు మండలం చోళసముద్రం, పిఎబిఆర్‌కు నూతనంగా 132/33 కె.వి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంజూరు చేసినట్లు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొంతకాలంగా చుట్టుపక్కల మండలాలు, గ్రామాల్లో విద్యుత్ సమస్యలను గమనించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా చోళసముద్రం, పిఎబిఆర్‌కు 132/33 కె.వి విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేయించి మంజూరు చేయించినట్లు తెలిపారు. సబ్‌స్టేషన్ మంజూరుకు కృషి చేసిన సిఎం జగన్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

రైతులకు మెరుగైన సేవలందించాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

రైతు భరోసా సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందించాలని విడపనకల్ మండల వ్యవసాయ అధికారి పెన్నయ్య సూచించారు. గురువారం మండల పరిధిలోని గడేకల్ రైతు భరోసా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఇందులో భాగంగా రైతులతో సమీక్ష నిర్వహించి సాగు వివరాలను తెలుసుకుని అనుసరించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఈక్రాఫ్ బుకింగ్ చేసుకున్న రైతులందరూ కచ్చితంగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా సిబ్బంది విజయ్, భూపతి, కరీం, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మహాపాదయాత్ర పోస్టర్లు విడుదల

ప్రజాశక్తి-గుత్తి

మాదిగల విశ్వరూప మహా పాదయాత్రకు సంబంధించిన పోస్టర్లను ఎంఆర్‌పిఎస్ జిల్లా మహిళా నాయకురాలు కె.సునీత ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా కె.సునీత మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఈనెల 7 తేదీ నుంచి నవంబర్ 7వ తేదీ వరకూ పాదయాత్ర చేపట్టారని చెప్పారు. నవంబర్ 7న హైదరాబాదులో విశ్వరూప మహాసభ ఉంటుందని, ఈ సభకు మాదిగలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు నగదాని సత్య, ఎన్.ఈరన్న, నాయకులు మద్దిలేటి, అంజి, నగేష్, చిట్టిబాబు, సురేష్, రాము, తదితరులు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రి వద్ద అన్నదానం

ప్రజాశక్తి-అనంతపురం

అన్నదానం చేస్తున్న నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు ఛైర్‌పర్సన్ నిర్మలామురళి

నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో అనంతపురంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద గురువారం పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నిర్మలమురళి మాట్లాడుతూ తమ పెద్దల జ్ఞాపకార్థం ట్రస్టు సభ్యులు శశికళ, కృష్ణమూర్తి, నిర్మలమురళి అన్నదానానికి సహకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఓబులపతి, నబి రసూలు, కిష్టప్ప, జగన్నాథ్, రవికుమార్, రామకృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టమోటా పైరుపై గడ్డిమందు పిచికారీ

గడ్డిమందు కొట్టడంతో దెబ్బతిన్న టమోటా పైరు

నార్పల : మండలంలోని నడింపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి ఆకులేటి పెద్ద చౌడయ్య సాగు చేసిన టమోటా పేరుకు గుర్తు తెలియని దుండగులు గడ్డి మందు పిచికారీ చేశారు. దీంతో పంట మొత్తం దెబ్బతింది. ఈ సందర్భంగా బాధిత రైతు మాట్లాడుతూ తన పొలంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు గడ్డి మందు పిచికారీ చేయడంతో నెలరోజుల టమోటా పంట పూర్తిగా నాశనమైందన్నారు. దీంతో సుమారు రూ.50 వేల వరకూ నష్టం వాటిల్లిందని వాపోయాడు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపాడను. కాగా పచ్చని పైరుకు గడ్డి మందు పిచ్చికారీ చేయడం మండలంలో చర్చనీయాంశంగా మారింది.

14న రాచపాలెం సాహిత్య సభ

అనంతపురం : స్థానిక ఆర్ట్స్ కళాశాల డ్రామా హాల్‌లో ఈనెల 14వ తేదీ శనివారం రాచపాలెం రచించిన రెండు పుస్తకాలు, ఆయన సాహిత్య జీవితంపై ఇతరులు రాసిన ప్రత్యేక సంచిక విమర్శ పునర్నవం పుస్తకాలను ఆవిష్కరించనున్నట్లు డాక్టర్ నానీల నాగేంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఆవిష్కరణ సభ, మధ్యాహ్నం సాహితీ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ సభకు శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి, జూలూరు గౌరీశంకర్, కొలకలూరి మధుజ్యోతి, బండి నారాయణస్వామి, శాంతినారాయణ, అట్టాడ అప్పలనాయుడు తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు.

బార్‌ను ఎత్తేయాలని ఫిర్యాదు

ఉరవకొండ : పట్టణంలోని గుంతకల్లు రోడ్డుకు అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన బార్ అండ్ రెస్టారెంట్లపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈమేరకు మానవ హక్కుల పరిరక్షణ సంస్థ డిప్యూటీ ఛైర్మన్ ఎం.నారాయణస్వామిని స్థానికులు గురువారం కలిసి వినతిపత్రం సమర్పించారు. బార్ చుట్టుపక్కల, పాఠశాల, ఆసుపత్రి, బ్యాంకులతోపాటు పలు కుటుంబాలు నివాసం ఉన్నాయన్నారు. ఇందుకు నారాయణస్వామి స్పందిస్తూ విషయాన్ని జిల్లా, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారిని కలిసి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

'ఆరోగ్య సురక్ష' దేశానికే ఆదర్శం : మేయర్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

రాష్ట్రంలో అమలు చేస్తున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం దేశానికే ఆదర్శమని మేయర్ మహమ్మద్ వసీం అన్నారు. గురువారం నగరంలోని 29వ డివిజన్ పరిధిలోని ఎస్‌వి డిగ్రీ కళాశాల సమీపంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని డిప్యూటీ మేయర్ వాసంతితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్ ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి కుటుంబం దగ్గరకు వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలను పంపించడం గొప్ప విషయమన్నారు. ప్రస్తుతం జీవనశైలి మార్పులతో దీర్ఘకాలిక వ్యాధులు పెరుగుతున్నాయని ఇలాంటి తరుణంలో ముందుగానే వాటిని గుర్తించి సరైన వైద్య సహాయం అందిస్తే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సైఫుల్లాబేగ్, అనిల్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : పౌష్టికాహారంతోనే తల్లులకు సంపూర్ణ ఆరోగ్యమని ఆర్‌డిఒ మధుసూదన్ సూచించారు. గురువారం మండల పరిధిలోని కొరివిపల్లిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆర్‌డిఒ పరిశీలించారు. ముందుగా ఐసిడిఎస్ ప్రాజెక్టు ఏర్పాటు చేసిన కాయగూరలు, పిండి పదార్థాలు, రాగిరొట్టే, జొన్న రొట్టె, మొలికెత్తిన గింజలతోపాటు పలు రకాలైన పండ్ల స్టాళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పంపిణీ చేస్తున్న పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నిర్మలాకుమారి, తహశీల్దార్ ఈశ్వరమ్మ, ఎంపిపి యోగేశ్వరి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పి.ఉమాదేవి, ఇఒఆర్‌డి మురళీకృష్ణ, సర్పంచి తరిమెల రాజారెడ్డి, పంచాయతీ కార్యదర్శి బాబయ్య, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : జగనన్న ఆరోగ్యసురక్ష పథకం ద్వారా వైద్యరంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తహశీల్దార్ నాగభూషణ తెలిపారు. గురువారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష పథకం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణులకు చక్కటి వైద్యం అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఆరోగ్య సురక్ష పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శ్రీదేవి, సర్పంచి వరలక్ష్మి, వైద్యులు శ్రీనివాసబాబు, శ్రీనివాసరెడ్డి, సీహెచ్ఐవో చిట్టితల్లి, ఆరోగ్య, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు శ్రీనివాసులు, వెంకటలక్ష్మి, ఆర్ఐ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పుట్లూరు : జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా గ్రామీణ ప్రాంతవాసులకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని ఎంపిడిఒ యోగానందరెడ్డి, తహశీల్దార్ మోహన్‌కుమార్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని కోమటికుంట్ల సచివాలయంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 229 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఎంపిడిఒ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి రాజేశ్వరి, వైద్యులు, వైద్య, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండల పరిధిలోని చామలూరులో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. దాదాపు 200 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా మలేరియా అధికారి ఓబులు, జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారి ఎస్.మహమ్మద్ రఫీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి స్వప్న, ఎంపిటిసి మల్లేశ్వరయ్య, ఎంపిడిఒ పి.దివాకర్, ఇఒఆర్‌డి జి.లక్ష్మీనరసింహ, వైద్యాధికారులు ప్రవీణ్‌కుమార్, రాజేష్, వైద్యులు అరుణజ్యోతి, ప్రసాద్, ఎంపిహెచ్ఒ మల్లికార్జున, శ్రీరాములు, పంచాయతీ కార్యదర్శులు వరలక్ష్మి, కుళ్లాయిస్వామి, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నార్పల కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

అనంతపురంలో వైద్యపరీక్షలను పరిశీలిస్తున్న మేయర్ వసీం

ఉరవకొండ : గ్రామీణ ప్రాంతాల్లోనే ప్రజలందరినీ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని విడపనకల్ ఎంపిపి కరణం పుష్పవతి భీమ్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల పరిధిలోని కరకముక్కల గ్రామంలో సర్పంచి రామాంజనేయులురెడ్డి, ఎంపిటిసి మల్లికార్జున ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పలువురికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాసులు, వైద్యాధికారులు శ్రీధర్, గంగాధర్, ఇఒఆర్‌డి సత్యబాబు, జెసిఎస్ మండల కన్వీనర్ భరత్‌రెడ్డి, వైసిపి నాయకులు కరణం భీమిరెడ్డి, సర్పంచి రామాంజనేయులురెడ్డి, ఎంపిటిసి మల్లికార్జున, రాముడు రెడ్డి, జగదీష్‌రెడ్డి, రామన్న, వడ్డే వెంకటేష్, గోపాల్, ఈరన్న, మహేష్, సచివాలయ, ఆరోగ్య, అంగన్‌వాడీ సిబ్బంది, వాలంటీర్లు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు మచ్చలు

బొమ్మనహాల్ : మండల పరిధిలోని దర్గాహొన్నూరు గ్రామంలో రైతు పాల్తూరు బాషాకు చెందిన పాడిఆవుకు దేహమంతా నల్ల మచ్చలు ఏర్పడ్డాయి. ఆ ఆవుకు వారం రోజుల నుంచి స్థానిక గోపాలమిత్ర చికిత్స చేసినా ప్రయోజనం లేక పోయింది. పశువుల అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చినా వారు స్పందించలేదు. ప్రస్తుతం ఆవు పరిస్థితి విష మంగా ఉందని, ఉరవకొండ ఆసుపత్రికి తరలించాలని పశువైద్యులు సూచించినట్లు తెలుస్తోంది. అయితే స్థాని కంగా పశువుల అంబులెన్స్ అందుబాటు లేకపోవడం, సొంత ఖర్చులతో ఆవును ఆసుపత్రికి తీసుకెళ్లడానికి సదరు రైతు ముందుకు రాకపోవడం వల్ల ఇది అంటువ్యాధి అని ఒక పశువు నుంచి మరొక పశువుకు వ్యాప్తి చెందుతుందని స్థానిక రైతులు వాపోతున్నారు. ఈ విషయమై స్థానిక పశు వైద్యాధికారి వెంకటరెడ్డిని వివరణ కోరగా ఆవుకు చికిత్స చేశాం మెరుగు పడవచ్చు అన్నారు.

మచ్చలతో ఉన్న ఆవు